

## బీజేపీ నాయకుల అరెస్ట్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో పెద్దమ్మ గుడి కూల్చివేతకు నిరసనగా మంగళవారం పెద్దమ్మ గుడి సందర్శనకు వెళ్తున్న మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీజేపి మండల అధ్యక్షులు సుంకరి పెంటన్న, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాటూరి జయరాజ్, బీజేపీ జిల్లా నాయకులు సప్త శ్రీనివాస్, బొమ్మెన ప్రసాద్ గౌడ్, వినోద్ రాథోడ్ ఉన్నారు.

## యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బోథ్):** ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ బోథ్ మండల కేంద్రానికి చెందిన మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్, ఆర్ఐ సునీతలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ మాట్లాడుతూ అక్షర క్రమంలో ముందున్న ఆదిలాబాద్ జిల్లాలో నేటికీ యూనివర్సిటీ లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని అన్నారు. విద్యార్థులు వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి చదువుకునే ఆర్థిక స్థోమత లేక మధ్యలోనే చదువును ఆపివేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పాత పది ఉమ్మడి జిల్లాల్లో యూనివర్సిటీ లేని ఏకైక జిల్లాగా ఆదిలాబాద్ నిలవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. యూనివర్సిటీ ఏర్పాటయ్యే వరకు తమ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ రాథోడ్, చంద్రకాంత్, విశాల్, ఆదిత్య, నితిన్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తాండూర్ సీఐ ఎన్ దేవయ్య తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలైన బ్లాక్ స్పాట్లను ఎస్సై కిరణ్ కుమార్ తో కలిసి సందర్శించారు. అనంతరం జాతీయ రహదారిపై సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేపట్టారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం నెంబర్ ప్లేట్ సరిగ్గా లేని వాహనాలకు, బ్లాక్ స్టిక్కర్, హెల్మెట్, రాంగ్ రూట్లో వస్తున్న వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల బారులు

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద మంగళవారం యూరియా కోసం మండలంలోని రైతులు బారులు తీరారు. యూరియా కొరత అధికంగా ఉండడంతో సహకార సంఘం కార్యాలయం తీయడానికి ముందే వచ్చి వేచి చూస్తున్నారు. మండలానికి సరిపడా యూరియా రాకపోయేసరికి కొరత ఏర్పడిందని, నేటివరకు తాండూర్ మండలానికి 236 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ప్రతి రైతుకు రెండు బస్తాల యూరియా ఇవ్వడం జరిగిందని తాండూర్ ప్రాథమిక సహకార సంఘం సెక్రెటరీ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా అధికారులకు ప్రతిసారి 40 టన్నుల యూరియా పంపాలని ప్రతిపాదనలు పంపితే, కేవలం 12 టన్నుల యూరియా పంపిస్తున్నారని తెలిపారు. దీంతో రైతులకు సరిపడా యూరియా అందడం లేదని పేర్కొన్నారు. కాగా తాండూర్ పోలీసులు సహకార సంఘం కార్యాలయం వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా రైతులను క్యూ లైన్ లలో నిలబెట్టి పరిస్థితిని సమీక్షించారు. కాగా యూరియా కోసం గంటల తరబడి క్యూ లైన్ లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలానికి సరిపడా యూరియాను పంపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# ఏయిడ్స్ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో ఏయిడ్స్ వ్యాధి నిర్మూళనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఇందిర ప్రియదర్శిని మైదానంలో మంగళవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యువతకు హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల సంపూర్ణ అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో అక్టోబర్ 31 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. అవగాహన కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకుని పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏయిడ్స్ వ్యాధి సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల పట్ల విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది సైతం పూర్తి అవగాహన కలిగి ఉండాలని, హాట్ స్పాట్స్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రానున్న మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోలెవెల్ వంతెనల వద్ద నీటి ప్రవాహం ఉన్న సమయంలో వెళ్లవద్దని సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 0.3 శాతం ఏయిడ్స్ పాజిటివ్ కేసులు ఉన్నాయని, గతంతో పోలిస్తే కేసుల సంఖ్య తగ్గిందన్నారు. వ్యాధి నివారణ చర్యలపై విద్యా సంస్థల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వ్యాధి సంక్రమించినవారు ఆత్మ స్థైర్యం కోల్పోకుండా క్రమం తప్పకుండా మాత్రలు తీసుకుంటూ వ్యాయామం చేయాలని సూచించారు. అనైతిక లైంగిక చర్యలతో వ్యాధి సోకుతుందని, రక్తం ఎక్కించే సమయంలోనూ పూర్తి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏయిడ్స్ పరీక్షలతో పాటు ఉచితంగా వైద్య చికిత్సలను ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంబధిత అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసీలపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

ఉద్యమ కెరటం, జైనూర్: మంచిర్యాల జిల్లా జన్నారం పరిధిలోని పాలగోరి గ్రామ ఆదివాసీలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడవి మనోహర్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి భగవంతరావు డిమాండ్ చేశారు. మంగళవారం జైనూర్ మండలం కేంద్రంలో మాట్లాడారు. గోండ్వాన రాజ్య పరిపాలన కాలం నుంచి కొన్ని వందల సంవత్సరాల క్రితం పాలగోరి గ్రామంలో అక్కడ స్థిర నివాసం ఉంటున్నట్లు తెలిపారు. దీంతోపాటు రెవెన్యూ భూమి, అటవీ ప్రాంతం కావడంతో దానిని ఫారెస్ట్ అధికారులు తమ అటవీ భూమిగా పరిగణిస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అక్కడ 35 మందిపై పోలీసులు అక్రమ కేసులు వేయడం జరిగిందని, దీనిని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు అన్ని ఆధారాలు ఉండి రెవెన్యూ భూమిలో అక్కడ తమ రెవెన్యూ భూమిని సాగు చేయడానికి వారు వెళ్తే వారి గుడిసెలను వారిపై దౌర్జన్యాన్ని చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇకపై తమ జోలికి వెళ్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. సర్వే నం.112లో ఆత్రం మహదు పట్టా భూమి ఉందని, మహాదు కుమారుడు ఆత్రం రాజు, మహదు వారసులు నివాసం ఉంటూ సాగు చేస్తున్నారని, అటవీ శాఖ అధికారులు వారి ఇడ్లను, గుడిసె లను కూల్చివేయడం సరికాదని మండిపడ్డారు. ఇదే సర్వే నంబర్ లో ఉన్న 110 ఎకరాలను గిరిజనేతరులు, లంబాడీలకు ఫారెస్ట్ పట్టాలు ఇచ్చారని, వారు సాగు చేస్తున్నారని, బావులు కూడా తవ్వడం జరిగిందని తెలిపారు. అసలైన పట్టాదారులు భూమి వారసులు ఆత్రం మహదు, ఆత్రం రాజు, ఆదివాసీలకు ఫారెస్ట్ అధికారులు అడ్డు రావడంతో పాటు దాడికి దిగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పాలగోరి గ్రామంలోని పురాతనమైన ఆకిపెన్, అవ్వాల్, మహాదేవల్, శివ్వబొడి దేవతలను పూజలు చేస్తుంటే అడ్డుకుంటూ అపవిత్రం చేస్తున్నారని తెలిపారు. గత 5 సంవత్సరాల నుంచి ఈ సమస్యను బయటకి రాకుండా చేస్తున్నారని, ఈ భూమి పూర్తి ఆధారాలు, పట్టాపహానిలు అన్ని పకడ్బందీ ఉన్నాయని, అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటూ దాడికి దిగుతున్నారని, దీన్ని వెంటనే ఆపకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా సహా కార్యదర్శి అడ సొనేరావు, తోడసం రమేష్, గెడం బాలు తదితరులు పాల్గొన్నారు.




## ఆదివాసి సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీలు ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలని కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నన్న, మండల అధ్యక్షులు కోరేత తిరుపతిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసి భవనంలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల సాధన కోసం ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో జరిగే కార్యక్రమాల కోసం మండలంలోని ఆదివాసి గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసిన అనంతరం మండల కమిటీని సైతం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 5 వరకు గ్రామాల వారీగా పర్యటనలు చేసి గ్రామ కమిటీలను వేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 7న మండల పూర్తిస్థాయి కమిటీ వేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కోయా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మెస్రం రాజారామ్, మహిళా మండల అధ్యక్షురాలు ఏనుక అమృత, నాయకులు ఏనుక అమృత, ఎలాది నారాయణ, బోయిని అశోక్, సడమేక పురుషోత్తం జ్యోతి, ఆత్రం రామయ్య, కర్పిత రమేష్, తొర్రెం బానయ్య, ఆత్రం రాజారాం, ఆత్రం గంగారాం, శంకర్, సడమేక రమేష్, శిడం సుధాకర్, కొడప సుధాకర్, మడే కళ్యాణ్, తిరుపతి, ఏనుక మాంతయ్య, పేదమ్ రమేష్, పేందం విట్టయ్య, మడవి సుదర్శన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియాతో అధిక దిగుబడి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** నానో యూరియాతో అధిక దిగుబడులు సాధించవచ్చని బెజ్జూర్ మండల వ్యవసాయ అధికారి బానోత్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని కుకుడా రైతు వేదికలో మంగళవారం నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనానో యూరియా, డీఏపీ వాడకంతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. రైతులు అధిక మోతాదులో పురుగుల మందులు, ఎరువులు వాడటంతో కలిగే నష్టాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మారుతి, రైతులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయి, ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు. ఇసుక ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారు. ఇటుకలకు ఒక ట్రిప్ కు ఎంత ఖర్చు అవుతుంది తదితర అంశాలపై లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా ఎంపీడీవో, పంచాయితి సెక్రటరి లు ఇసుక ఎక్కడెక్కడ అవసరం ఉందో తెలుసుకొని, ఇసుక అందుబాటులో ఉన్న చోట వారికి కూపన్ ఇచ్చి పంపించాలని, ఇసుక ఉచితంగానే ఇస్తారని, రవాణ చార్జీలు మాత్రమే పెట్టుకోవాలని అన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తెలియజేయాలని పేర్కొన్నారు. ఆన్ లైన్ నమోదును పరిశీలించి నెట్ వర్క్ ప్రాబ్లం సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీ, ఎంపీడీవో, ఎంపీవో, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణాన్నివేగవంతం చేయాలి

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. బెజ్జూర్ గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను మంగళవారం కార్యదర్శి వైకుంఠంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పునాది వరకు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వారి ఖాతాలో మొదటి దఫా రూ.లక్ష బిల్లులు చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. ఆయన వెంట ఇందిరమ్మ కమిటీ సభ్యులు షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.



# మహిళల అభివృద్ధికి అనేక పథకాలు



జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని, అర్హత గల ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి గ్రామీణ పేదరిక నిర్మూళన సంస్థ ఆధ్వర్యంలో నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు గ్రామైక్య సంఘాల వీఓలు, ఏపీఓలు, కమ్యూనిటీ సమన్వయకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల పేరిట అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద అనేక వ్యాపారాలు నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఇతర ఎంటర్ ప్రైజెస్ ల నిర్వహణకు తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తే కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. అర్హత గల ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్పించే విధంగా ఏపీఎంలు, సీసీలు కృషి చేయాలని తెలిపారు. సంఘంలో సభ్యులుగా చేరితే కలిగే ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించాలని, ఈనెల చివరిలోగా ప్రతి మహిళ సంఘంలో సభ్యులుగా ఉండేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యాదగిరి, శేష రావు, యశోద, నరేందర్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, గౌరవ అధ్యక్షురాలు శ్రీదేవి, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, సీసీలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అడ గ్రామపంచాయతీ పరిధిలోని వాడిగూడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య సంస్థలను బలోపేతం చేసి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు గల రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పాఠశాల పరిధిలోని విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావాలని, బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్న భోజనం తయారు చేసే గది శుభ్రంగా ఉంచాలని, వంట తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని సూచించారు. వంట చేసేవారు శుభ్రత పాటించాలని, విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించాలని పేర్కొన్నారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారి ఉదయ్ బాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# 72 గంటలు జిల్లా అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** వాతావరణ శాఖ సూచన మేరకు వచ్చే 72 గంటలు జిల్లా అధికార యంత్రం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జూమ్ ద్వారా అన్ని మండలాల తహసిల్దార్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, విద్యుత్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రోడ్లు భవనాలు, పశు సంవర్ధక, నీటిపారుదల శాఖల అధికారులతో ఎస్. పి. కాంతిలాల్ సుభాష్, జిల్లా అదనప కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే 72 గంటలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రజా రక్షణ చర్యలలో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాలలో అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండి విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న నివాసాలలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రోడ్లు భవనాల శాఖ అధికారులు వరద ప్రభావానికి గురయ్యే రహదారి ప్రాంతాల వద్ద వాహనదారుల సంక్షేమం కోసం సూచికలు ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి ప్రాణ నష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో అవసరమైన మందులతో సిద్ధంగా ఉండాలని, గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. పర్యాటక, జలాశయాల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని, అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని తెలిపారు. సెలవులను రద్దు చేస్తున్నామని, అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





భారీ వర్ష సూచన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఇతర శాఖల జిల్లా అధికారులు.

- ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్



## దుండగులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

### జిల్లా ఎస్పీకి న్యాయవాదుల వినతి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ న్యాయవాది పూదరి నరహరిపై దాడి చేసిన దుండగులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం కోర్టు నుంచి న్యాయవాదులు ర్యాలీగా ఎస్పీ కార్యాలయం వరకు చేరుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది నరహరిపై తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేసిన రెబ్బెన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాది నరహరికు న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, సిర్పూర్, గోదావరిఖని, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ న్యాయవాదులు ముక్త సురేష్, రజీ హైదర్, బోనగిరి సతీష్ బాబు, రాపర్తి రవీందర్, సంగ్రాస్ శ్రీనివాస్ రావ్, నికోడే రవీందర్, శైలజ, బావండ్లపల్లి శ్రీనివాస్, గుండారపు గణపతి, చంద్రకుమార్, రాజీవ్ రెడ్డి, జే శ్యాంకుమార్, పూదరి నరహరి, విద్యాసాగర్, ఎం చరణ్ తేజ, లాల్ షా, రోణిక్ అగర్వాల్, గంట కళ్యాణ్, ప్రత్యుష, అనిత, గణేష్, ఎల్ నాగేష్, గణపతి, రాజ్ కుమార్, అరవింద్, ఇగురపు సంజీవ్, న్యాయవాదుల గుమస్తా సభ్యుల శివ చందు, శంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కోడె రమేశ్ మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో అమరులైన వారిని స్మరించుకుంటూ నేటి భావితరాలకు వారి త్యాగాలను గుర్తు చేస్తూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. 79వ స్వతంత్ర దినోత్సవాన్ని ప్రపంచానికి మన దేశ శక్తిని చాటిన సైనికుల వీరత్వానికి ప్రతీకగా నిలిచిన ఆపరేషన్ సింధూర్ విజయం పట్ల గర్వంతో ప్రతి ఇంటిపై జాతీయ జెండాతో దేశభక్తిని చాటుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ జిల్లా కన్వీనర్ మల్లారం సంతోష్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ దేశాలకు భారత దేశ చరిత్రను, ఐక్యతను చాటేవిధంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ కొక్కు దేవేందర్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, బీజేపీ సీనియర్ నాయకులు గంట అశోక్, మాజీ ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మలేష్ యాదవ్, విగ్నేష్ గౌడ్, ఉపాధ్యక్షులు బి నర్సింలు, కోశాధికారి నాగరాజు గౌడ్, మండల కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, పత్తి స్వామి, కల్వకుంట్ల కిషన్ రావు, ఆంజనేయులు, టి స్వామి, మహేష్ యాదవ్, సర్వోత్తమ్, దేవేందర్ యాదవ్, భాషవేణి రవీందర్, కొమిరిశెట్టి రాజు, ఎల్లం, నర్సింలు, రాజు, శ్రీధర్ గౌడ్, శ్రీనివాస్ చారి, నరేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### లో లెవెల్ బ్రిడ్జిలను దాటే ప్రయత్నం చేయవద్దు : ఎస్పీ కాంతిలాల్ పాటిల్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** వచ్చే మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేయడం జరిగిందని, జిల్లాలోని లోతట్టు, ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్ట్, రహదారులపై నుంచి దాటవద్దని సూచించారు. జలాశయాలు, చెరువులు, కుంటలను చూడడానికి వెళ్లకూడదని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్, ట్రాన్స్ ఫార్మర్లను తాకవద్దని, గ్రామాల్లో చేపల వేటకు ఎవరు వెళ్ళవద్దని, రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, నీరు నిల్వ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గరికి వెళ్లరాదని, వాటర్ ఫాల్స్ ప్రాంతాలను సందర్శించవద్దని పేర్కొన్నారు. అత్యవసరమైతే తప్పా ఎవరుకూడా బయట రావద్దని, వరద ప్రవాహల వద్ద బందోబస్త్ ఉన్న పోలీస్ సిబ్బంది సూచనలు పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైన వాటిని ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని, ముంపు ప్రాంతాల ప్రజలకు తక్షణ సహాయం కోసం జిల్లా విపత్తు ప్రతిస్పందన దళాలు (డీడీఆర్ఎఫ్) బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా పాలన యంత్రం, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, రెస్క్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. విపత్కార పరిస్థితులు ఎదురైతే ప్రజలు పోలీస్ శాఖ సహాయం తీసుకోవాలని, డయల్ 100, లేనియెడల సెల్: 8712670551 పై సంప్రదించాలని తెలిపారు. జిల్లాలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు చేపట్టే చర్యలకు సహకరించాలని కోరారు.

